క్లుప్తంగా

సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని సంఘ సీఈఓ వీరవెంకయ్యకు అందిస్తున్న మధు

టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరం సహకార సంఘం అధ్యక్ష పదవికి వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ వీరవెంకయ్యకు అందించారు. తనతో పాటు సంఘ డైరెక్టర్లు కూడా రాజీనామా చేసినట్టు చెప్పారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అందుబాటులో ఉన్న మంచి చికిత్స, నాణ్యమైన మందుల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేద వైద్యుడు బీవీఎం నగేష్ అన్నారు. స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయా వ్యాధుల నివారణకు డాక్టర్ నగేష్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శిబిరంలో బొలిశెట్టి సురేష్, చెన్నా వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



దెందులూరు గౌడవీధిలోని గంగానమ్మ తల్లి

దెందులూరు: దెందులూరు గౌడవీధిలో గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి విశిష్ట అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనేక గ్రామాల నుంచి వచ్చే భక్తులకు రెండవ రోజు ఆదివారం మహాన్నదానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగానమ్మ తల్లి ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్టు కొండ్రు సత్యనారాయణ తెలిపారు.

నేడు బ్రహ్మశ్రీ చాగంటి ప్రవచనం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ప్రవచనం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



రాస్తారోకో చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని కంపెనీ యాజమాన్యం అన్యాయంగా మూసివేసి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని, కంపెనీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ఉద్యోగులు శనివారం ఆందోళన చేపట్టారు. కంపెనీ గేటు వద్ద వారంతా నిరసన దీక్ష చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు. తమను ఉద్యోగాలలోకి తీసుకున్న సమయంలో ఉద్యోగభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని యాజమాన్యం విస్మరించి ఉద్యోగులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. థాయిలాండ్‌కు చెందిన సీపీఎఫ్ రొయ్యలు, చేపలమేతల తయారీ కంపెనీకి దేశంలో అనేక చోట్ల యూనిట్లు ఉన్నాయని, వీటిలో సరిపల్లె యూనిట్ లాభాలలో ఉన్న అన్యాయంగా మూసి వేశారని ఉద్యోగులు వాపోయారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. గణపవరం భీమవరం ప్రధాన రోడ్డుపై ఆందోళన నిర్వహించారు.

వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ద్వారకానగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం దాతలు రూ. 50,116 అందజేశారు. టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, పాతూరు వాస్తవ్యులు యడ్లపల్లి కాశీ విశ్వేశ్వరరావు, సుమతి దంపతులు, కుమార్తె మాధవి ప్రియ, కుమారుడు రఘువర్ధన్, కుటుంబ సభ్యులచే విరాళాన్ని ఆలయ ట్రస్టుకు అందజేశారు.

సంతాన వేణుగోపాలస్వామి వార్షికోత్సవాలకు సర్వం సిద్ధం

యర్రగుంటపల్లిలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు

చింతలపూడి: చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో 200 ఏళ్ల నాటి చారిత్రక ప్రాధాన్యత గల సంతాన వేణుగోపాలస్వామి వార్షిక ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 గంటల నుంచి శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, శ్రీ షిర్డీ సాయిబాబా, అయ్యప్ప స్వాములకు అత్యంత వైభవంగా విశేష పూజలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో వేంచేసిఉన్న విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, మాలికపురోత్తమ మంజుమాత అమ్మవారు, దత్తాత్రేయుని విగ్రహాలక కూడా పూజలు చేయనున్నారు. 1893లో చంద్రగిరి కాశీ అనే భక్తునికి స్వామివారు స్వప్నంలో కనిపించి యర్రగుంటపల్లి గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయం నిర్మించాలని ఆదేశించడంతో గ్రామస్తులతో చర్చించి ఆలయం నిర్మించినట్టు పూర్వీకులు చెబుతారు. నాటి నుంచీ ప్రతి సంవత్సరం ధనుర్మాసం మొదలు సంక్రాంతి పండుగ వరకు స్వామివారిని ఊరేగింపు, కల్యాణం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలకు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని, ఉత్సవాల చివరి రోజు వేలాది మందికి అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేశారు. స్వామిని మొక్కుకుంటే సంతానం కలుగుతుందని ఈ ప్రాంత వాసుల నమ్మకం.



ఆలయ ప్రాంగణంలో నిర్మించిన షిరిడీసాయి, అయ్యప్ప ఆలయాలు



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ మూర్తులు

కోర్కెలు తీర్చే దేవుడు



వేణుగోపాల స్వామి మహిమగల దేవుడు. మూడు రోజులపాటు భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తాం. దాతల సహకారంతో గుడిని అన్ని విధాలా అభివృద్ధి చేశాం. అందరు దేవుళ్లు ఒకేచోట గ్రామస్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశాం. వేణుగోపాలస్వామిని మొక్కుకుంటే భక్తుల కోర్కెలు తీరినట్టే. ముఖ్యంగా సంతానం లేని వారికి సంతానం ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం.

– చంద్రగిరి శేష కిరణ్, ఆలయ ధర్మకర్త

రామోజీ మృతికి మాజీ హోంమంత్రి సంతాపం



తానేటి వనిత, మాజీ హోంమంత్రి

ద్వారకాతిరుమల: ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మృతికి రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత శనివారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన మరణ వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

థైరాయిడ్ టెస్టింగ్ మెషీన్‌ను వినియోగంలోకి తేవాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న థైరాయిడ్ మెషీన్‌ను వినియోగంలోకి తేవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ ఆసుపత్రిగా మార్పు చేసిందని, రోగుల సౌకర్యార్థం దాదాపు రూ.20 లక్షల విలువైన థైరాయిడ్ టెస్టింగ్ మెషీన్‌ను కొనుగోలు చేసి పంపించిందని తెలిపారు. గత సంవత్సర కాలంగా ఈ థైరాయిడ్ మెషీన్ మూలన పడి, రోగుల పరీక్షలకు వినియోగించడం లేదని పేర్కొన్నారు. థైరాయిడ్ టెస్టుల కోసం సిబ్బందిని నియమించకపోవడం , ఉన్నవారికి ట్రెనింగ్ ఇవ్వకపోవడం వల్ల అత్యంత విలువైన థైరాయిడ్ టెస్టింగ్ మెషీన్ నిరుపయోగంగా మారిందని, దీనిని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి నిత్యం వచ్చే 10 మంది వరకు రోగులు థైరాయిడ్ పరీక్షలు బయట చేయించుకోవాల్సి వస్తోందని, దీంతో రూ.500 నుంచి రూ.1000 చొప్పున చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

65 మందికి వైద్య సేవలు

భీమడోలు: మండలంలో గుండుగొలనులో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. సీహెచ్ పోతేపల్లికి చెందిన సాయి జనరల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రామకృష్ణ నేతృత్వంలోని వైద్యులు 65మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ అందజేశారు. ఈ శిబిరాన్ని శ్రీసత్యసాయి సేవా సమితి మెడికల్ జిల్లా కోఆర్డినేటర్ కోడూరి నరసింహమూర్తి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు సత్యసాయి సేవా సంస్థ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడూరి శివ రామకృష్ణ, గుండుగొలను కన్వీనర్ జీవీ సుబ్బారావు, యూత్ కోఆర్డినేటర్ కాబోతుల సోమేశ్వరరావు, సభ్యులు గెడ్డం రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పారిజాత గిరి వెంకన్నకు పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ, ఆరాధన, తోమాల సేవ, బాలభోగనివేదన, తీర్థప్రసాద గోష్టి తదితర పూజా కార్యక్రమాలు అర్చకుడు నల్లూరి రవికుమారాచార్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులను సమర్పించుకున్నారు. ఏజెన్సీ, జిల్లాలో నలుమూలల నుంచి విద్యార్థులు వేసవి సెలవులు ముగియనుండటంతో భక్తులు భారీగా తరలివచ్చారు. అల్లంచర్ల గ్రామానికి చెందిన పసుమర్తి వెంకటేశ్వరరావు, కమలకుమారి, వారి కుటుంబసభ్యుల సహకారంతో భక్తులకు అన్నప్రసాదా వితరణ చేశారు. దాతలును శ్రీస్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు వేద పండితులు ఆశీస్సులతో సన్మానించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా తమ్మిలేరు వంతెన

- శివపురం – చిన్నంపేట గ్రామాల మధ్య కోతకు గురవుతున్న వంతెన
- రెయిలింగ్ లేక తరచూ ప్రమాదాలు

చింతలపూడి : ఏలూరు జిల్లా చింతలపూడి మండలం శివపురం – చిన్నంపేట గ్రామాల మధ్య తమ్మిలేరుపై ఉన్న వంతెనకు రెయిలింగ్ లేక ప్రమాదకరంగా మారింది. 2010లో వచ్చిన భారీ తుపానుకు వంతెన కోతకు గురైంది. అప్పట్లో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. అప్పటి కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు వంతెనను పరిశీలించి అప్పటి కలెక్టర్‌తో మాట్లాడి వంతెనకు మరమ్మతులు చేయిస్తానని, రెయిలింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వంతెనకు రెయిలింగ్ లేక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి ఏటా వంతెనపై నుంచి పశువులు కాలువలో పడి మృతి చెందుతున్నాయి. వరదలు వచ్చి తమ్మిలేరు పొంగిన సమయంలో వంతెన పై నుంచి వరద నీరు ప్రవహించి వారం రోజుల పాటు రాకపోకలు అంతరాయం ఏర్పడుతుంది. ప్రతి ఏటా వరదలకు వంతెన సమీపంలో గండి పడటం, అనంతరం ఇసుక బస్తాలు వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం అధికారులకు పరిపాటిగా మారింది. వెంటనే వంతెనకు మరమ్మతులు చేయించాలని, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



శివపురం - చిన్నంపేట గ్రామాల మధ్య ప్రమాదకరంగా మారిన తమ్మిలేరు వంతెన

తరచూ ప్రమాదాలే



వంతెనకు రెయిలింగ్ లేక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో వాహనాలపై వచ్చే వారు వంతెనపై నుంచి పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. వెంటనే రెయిలింగ్ నిర్మించాలి.

– నరుకుళ్ల రవీంద్ర, మాజీ సర్పంచ్, శివపురం

విద్యతోనే ఉన్నత శిఖరాలు



కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న దేవపాల్

కొయ్యలగూడెం: దళితులంతా విద్యకు ప్రాధాన్యత ఇచ్చి, తమ పిల్లలను మంచి చదువులు చదివించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తయారు చేయాలని మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవ పాల్ పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు, మాజీ ఎంపీటీసీ కునపోము రాజారత్నం ఇంటి వద్ద దళితుల ఆత్మీయ కలయిక సదస్సు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా మేడ్ అధ్యక్షుడు లాగు జయరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా దేవపాల్ మాట్లాడారు. దళితులంతా తమ పిల్లలను విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. దళిత ఉద్యోగులు అంబేడ్కర్ ఆలోచనలతో పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో తమ వంతు సహకారం అందిస్తూ ఐక్యత, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నూతన ప్రభుత్వం దళిత అనుకూల నిర్ణయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేడ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కిరపాటి మధు, పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడు కునపాము సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేతక్ మెరిట్ స్కాలర్‌షిప్



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించిన నాయకులు

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామంలో బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ మెరిట్ విద్యార్థులకు శనివారం చేతక్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేశారు. జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ రాజపుత్ర స్వాతంత్ర్య పోరాట యోధుడు మహా రాణా ప్రతాప్ స్వారీ చేసే గుర్రం చేతక్ ప్రపంచంలోనే అత్యంత బలశాలి, వీర పరాక్రమం కలిగినదిగా ప్రసిద్ధి పొందిందన్నారు. ఈ చేతక్ యుద్ధ రంగంలో రాణించినట్టు విద్యార్థులు తమ చదువుల్లో ఉన్నత ప్రతిభను సాధించాలని ఆకాంక్షించారు. సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన నాగ భవాని, షణ్ముక్‌లకు, ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బోడ కిరణ్, జరభల ఆసీస్‌లకు చేతక్ పేరుతో మెరిట్ స్కాలర్ షిప్ అందజేశామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులను సంఘం తరుపున ఘనంగా సన్మానించారు. ఈ స్కాలర్‌షిప్‌కు జరభల కృష్ణ, విమలాబాయి దంపతులు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. విద్యార్థులకు జ్ఞాపిక, నగదు పారితోషకం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణ ప్రసాద్, చందా నాయక్, పూర్ణయ్య, వెంకా నాయక్, రమేష్ నాయక్, బిగనాథం నాయక్, రాజా నాయక్, ప్రమీలా దేవి, రవి నాయక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: సోమవరప్పాడు పంచాయతీ ఉప్పుగూడెంలోని పెద్దింట్లమ్మ తల్లి 15వ ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయం అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేసి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా పూర్తి చేశామన్నారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకాలంకరణ అనంతరం పూజలు, మహాన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్



జంగారెడ్డిగూడెం బోసుబొమ్మ సెంటర్‌లో పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణ, మండలంలో పోలీస్ పికెటింగ్‌లు కొనసాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అనంతరం శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ రవిచంద్ర పర్యవేక్షణలో సీఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు పికెటింగ్ నిర్వహిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం, తాడువాయి, శ్రీనివాసపురం, పేరంపేట, పంగిడిగూడెం తదితర ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ భావోద్వేగాల అధికంగా ఉన్న నేపథ్యంలో అసాంఘిక ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా పికెటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న పోలీస్ పికెటింగ్‌ను శనివారం రాత్రి సీఐ రాజేష్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై పి.జ్యోతి బాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి కిషోర్

ఏలూరు (టూటౌన్) : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఎం ఏలూరు నగరకార్యదర్శి పి.కిషోర్ కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సీపీఎం నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు నగరంలో ఉన్న ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. ఏటా ఇష్టానుసారంగా స్కూలు, కాలేజీల ఫీజులు పెంచుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, జీఓ 53, 54 ప్రకారం ప్రైవేటు స్కూలు, కాలేజీలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ.10 వేలు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.15 వేలు, కాలేజీల్లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపును బట్టి రూ.15 వేలు నుంచి రూ.17,500 వరకు మాత్రమే ఫీజులు వసూలు చేయాలని తెలిపారు. కానీ ప్రైవేటు విద్యాసంస్థలు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ.15 వేలు నుంచి రూ.40 వేలు వరకు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.30 వేలు నుంచి రూ.65 వేల వరకు, కాలేజీల్లో రూ.70 వేలు నుంచి రూ.లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని వివరించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎక్కడా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడం లేదని విమర్శించారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని, అది ఎక్కడా అమలు చేయడం లేదని అన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ నిబంధనలు అమలు చేసేందుకు ఒక కమిటీ వేయాలని కోరారు. పిల్లలకు తగిన వాష్ రూమ్‌లు, క్లాస్ రూముల్లో బల్లలు, కుర్చీలు, ఫ్యాన్లు, స్కూల్ లైబ్రరీ, క్రీడా స్థలం తగిన సౌకర్యాలతో ఉండాలని, ఐతే అవి ఎక్కడ సక్రమంగా లేవని వాపోయారు. పిల్లలు తాగేందుకు కనీసం ప్యూరిఫైడ్ నీరు కూడా లేవని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యాశాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థల్లో తనిఖీలు చేసి తక్షణమే ప్రభుత్వ నిబంధనలు అమలుచేయని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కె.రామాంజనేయులు, బి.జగన్నాథ రావు, వి.సాయిబాబు, వీవీఎస్ ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్ కనకారావు, ఎం.అరుణ కుమారి, హైమ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రమైన మద్దిక్షేత్రం



గురవాయిగూడెం మద్దిక్షేత్రంలో భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. వాహన పూజలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.1,88,015 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండల రావు తెలిపారు. వెయ్యి మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

ఉంగుటూరు: చలి, వణుకుతో కూడిన జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు సూచించారు. జాతీయ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు డా.మానస, డా.సాయి అనూషలు మాట్లాడుతూ చలి, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి కమతవరపు శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు కె.సత్యనారాయణ, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

15 నుంచి రైతు కూలీ సంఘం మహాసభలు

ఏలూరు (టూటౌన్) : స్థానిక టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలు ఈ నెల 15,16,17 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ తెలిపారు. స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని జాబిల్లి కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. జూన్ 15న ఉదయం 11 గంటలకు ప్రారంభ సభ, సాయంత్రం ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. 16వ తేదీన వ్యవసాయ రంగ సంక్షోభం – పాలకుల విధానం – మన కర్తవ్యాలుపై సదస్సు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వర రావు ప్రారంభోపన్యాసం చేస్తారని, గ్రామీణ యువత నిరుద్యోగం వలసలు అనే అంశంపై ఐఏఎస్ మాజీ అధికారి, రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అటవీ హక్కులు పునరావాసం అనే అంశంపై రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ ఝాన్సీ, భూమి సమస్య సామాజిక న్యాయం అనే అంశంపై దళిత బహుజన మహాసభ నాయకులు వై.కోటేశ్వర రావు మాట్లాడతారని చెప్పారు. పంజాబ్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు నుంచి ప్రతినిధుల సందేశాలు, రైతు – వ్యవసాయ కూలీ సంఘాల నాయకులు సౌహార్ద సందేశాలు ఉంటాయని తెలిపారు. 17వ తేదీన గత కార్యకలాపాల నివేదిక, నూతన కమిటీ ఎన్నిక ఉంటాయన్నారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మహాసభల వాల్ పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, కోశాధికారి పి.లలిత కుమారి, జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.